రావుకు. సభ్యత తెలిసినవాడు గనుక చచ్చినట్లు వీణాధరి మాటలు విన్నాడు. కనీసం విన్నట్లునటించాడు.

ఆ సాయంత్రం ఆమెను రైలెక్కించినతరువాత తాను ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి రాజారావు "నువ్వు వెళ్ళేసరికి మీ వారు రారను కొంటానేం ?" అన్నాడు.

"అవును ... ... రారు" దిగాలుగా అంది వీణాధరి.

"హమ్మయ్య ! ఐతే నువ్విలా వచ్చినట్లు ఆయనకు తెలిసే అవకాశం లేదు" అన్నాడు రాజారావు.

వెంటనే వీణాధరి ముఖం జేవురించింది.

"ఎందుకు లేదూ ? నేనే చెప్తాను. నే నేమంత ఘోరంచేశానని దాన్ని పరమ రహస్యంగా వుంచటానికి ? మా వారికి నామీద సంపూర్ణమైన విశ్వాసం వుంది. నేను జరిగింది జరిగినట్టు చెపుతాను. ఒకవేళ వారికి తప్పనితోస్తే తోచనీ. వారు వేసే యే శిక్షైనా సంతోషంగా భరిస్తాను. ఒక పని చెయ్యటానికి సాహస మున్నప్పుడు ఫలితాల ననుభవించే ఓపిక కూడా వుండాలి. అంతేకాని ఆయన దగ్గిర నేనేందాచను."

రాజారావు విస్తుపోయాడు. మనసులో "నీ కర్మ" అనుకొని పైకి "మంచిది. అలాగే చెయ్యి" అన్నాడు.

అంతలో లైట్లు వెలిగాయి. వీణాధరి చటుక్కున తన మాంగల్యాలను తీసి కళ్ళ కద్దుకొంది. రాజారా వది చూసిచాలా ఆశ్చర్యపోయాడు. వీణాధరికిమాత్రం తానేంచేస్తున్నదో తనకు తెలియదు. అదొక అసంకల్పిత ప్రతీకారచర్య. తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన ఒకానొక సంప్రదాయపు గుర్తు.

రైలు బిగ్గరగాకూస్తూ కదిలింది. వీణాధరి కనబడినంతసేపు చెయ్యి వూపి, వెనుదిరిగాడు రాజారావు.

వీణాధరి రాక, ఆమెరాకలోని ఉద్దేశ్యం, తీరావచ్చిన తరువాత ఆమె తీరూ, అంతా విచిత్రంగా అనిపించింది, రాజారావుకు. లైట్లు వెలగగానే, ఆమె తన మాంగల్యాన్ని కళ్ళ కద్దుకోవటంగుర్తుకొచ్చింది. ఆదృశ్యం మనసులో తలచుకోగానే, అతనికిలా అనిపించింది.


"వీణాధరి మనసు ఒక డోలిక లాంటిది. గాలి తాకిడికి డోలిక వెనుక ముందులకు ఊగినా, అది స్థిరత్వాన్ని పొందేదిమాత్రం, అది బంధింపబడినశాఖనాశ్రయించుకొనే! వీణాధరి మనసుకూడా, మాంగల్యాలనే సూత్రాలతో, ఆమె భర్త అనే కేంద్రానికి బంధింపబడింది. ఉద్వేగ ఝుంఝూమారుతా లామె మనసునెటు వూపినా, చివరికామె తన భర్తనాశ్రయించుకొనే ప్రశాంతినిపొందుతుంది."

□□□





# అర్ధ రూపాయి



సాధారణంగా అజ్ఞానదశలోని పసి పిల్లకాయలు, నెత్తిన ఎర్రపాగా, చేతిలో లాఠీ, కాళ్ళకి బూట్సు, వంటి మీద యూనిఫారం వేసుకొని సాక్షాత్కరించే పోలీసు జవానుల స్వరూపాలు చూచి భయపడడం అక్కడక్కడ కద్దు.

## కాని, అదేమి ఖర్మమో - మైనార్టీ తీరి, బిడ్డల్ని కని సంసారం నెత్తినబడ్డ యీడులో కూడా ఎఱ్ఱగుడ్డనిచూచి భయపడడం ఇదేం గ్రహచారం ? చిన్నప్పటినుండీ పట్నవాసంలో ఉండి కూడా అతనికి పోలీసులంటే యీ భయమేమి ఖర్మం ?

"ఎవరన్నా ఇన్నేళ్ళు వచ్చికూడా పోలీసులంటే యీ భయమేమిటని ప్రస్తావనచేస్తే, "నీకేం తెలుసు. వాళ్ళ దుర్మార్గం నీకు తెలియదు. తుపాకీ ఢాం అని కాల్చినా, లాఠీకర్రతో నెత్తిన ఒక్కపెట్టు పెట్టినా, నెత్తిన ఏ నేరమో రుద్ది అరదండాలు తగిలించి జైల్లో పారేసినా మనకెవరు దిక్కు?" అని వాదించి తనతత్వాన్ని సమర్థించుకొంటూ ఉండే వాడు వేదాంతాచారి. అతనికింగ్లీషు చదువు వాసనలేకుంటేమాత్రం, తెలుగులోనూ, సంస్కృతంలోనూ అతనుచదివిన చదువేమిటి, అతని వేదాంతమేమిటి, పోలీసులంటే ఈ భయమేమిటి ?

ఆ సాయంకాలమేమి జరిగిందా—

గోపాలస్వామి ఆలయంలో స్వాములవారు వేదాంతోపన్యాసం ఇస్తున్నారంటే ఉపన్యాసం వినడానికి వెళ్ళాడు ఆచారి. ఓ, ఉపన్యాస మేమిటి, అమృతం కురిపించారు—మహానుభావులు.

సాయంత్రం అయింది. ఉపన్యాసంవిని, దేవాలయం ఆవరణ దాటి వీధిలో అడుగుపెట్టే వరకు, క్రింద దుమ్ములో తళతళలాడుతూ ఆచారి కంటికొక తెల్లని వస్తువు గోచరించింది. ధూళిలోపడి దొర్లాడే ఆ వస్తువుకు—దాన్నితగలెయ్యా—ఎంత బలం పెట్టాడో భగవంతుడు, అతన్ని అక్కడ ఖడేరావని నిలబెట్టి వేసింది. సూదంటురాయి యినుమును లాగినట్టు ఆ వస్తువు అతని భౌతిక శరీరాన్ని ఊ క్రిందికి లాగేసింది.

ఆ వస్తువును చేతిలోనికి తీసుకొని చూడకుండా వెళ్ళడం ఎట్లా?

ఏమిటా అని ముందుకు వంగి తీసుకొని చూశాడుగదా? దీని తస్సాదియ్యా అది సింహంమార్కు అర్థరూపాయి కాసు.

అతని చేతులు గడగడ వణికేయి. నలుప్రక్కలా తిరిగి చూచాడు. దగ్గరలో ఎవ్వరూ లేరు. ఎవరిదో ఈ అర్థరూపాయి? ఛీ, ఛీ, పరాయి డబ్బు పాపిష్టిడబ్బు. ముట్టుకో కూడదు. ఆ కాసు అక్కడే తిరిగి పారేసి పోదామనుకున్నాడు. దుమ్ములో కప్పి పెట్టేద్దామనుకొన్నాడు. వెనుకనుంచి ఎవరో ఆచారీ అని పిలిచినట్లనిపించింది. ధడాలున అర్థరూపాయి జేబులో పడేసి తువాలు కప్పుకొన్నాడు. వెనక్కి తిరిగి చూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. కదిలి వెళ్ళిపోయాడు.

తాను ఆ అర్ధరూపాయ కాసు తీయడం ఎవ్వరూ చూడనట్టేగదా.



ఏమి చూస్తే? గానేమీ దొంగ గను[illegible]గులేదు. దొమ్మీ చేయ[illegible] [illegible]పిడీ జరుగులేదు. ఈపణ్రత[illegible] ఒగ్గయిన ధనేషణ మిక్కిలి పాపభూయిష్ఠమైనదని ఇంతకుముందే స్వాములవారు ఉపన్యాసంలో చెప్పారు. ఈ పాడు డబ్బు ఎవరిక్కావాలి? ఈ సొమ్ము పారేసుకున్న పెద్దమనిషి వచ్చి అడిగితే, గిరగిర త్రిప్పి పారేయడాని కతని కథ్యం తరం లేదు.

రస్తానబడి రెండు ఫర్లాంగులు దక్షిణంగా పోయాడు ఆచారి. వెనక నుండి ఎవరో తరుముకొని వస్తున్నట్టనిపించిం దతగాడికి. తిరిగి చూచాడు. అక్కడక్కడ జనం వస్తున్నారు, పోతున్నారు. నిలబడ్డాడు. దగ్గరకు వచ్చిన ఒకరిద్దరు పెద్దమనుష్యుల ముఖంలోకి చూచాడు. ఎవ్వరూ డబ్బుసంగతి తనతో ప్రస్తావన చేయకుండానే వెళ్ళిపోయారు. అతనికి కొంత ధైర్యం వచ్చింది.

బళ్ళమెట్టుదగ్గరకు వచ్చాడు. పిల్లకాయలు చేతులు వెనక్కిపెట్టి ముందుకు వంగి ఏమిటో వెతుక్కొంటున్నారు. అతని గుండె జల్లుమన్నది.

"ఏమిటబ్బాయీ, వెతుక్కొంటున్నారు" అనడిగాడు.

వాళ్ళేమి సమాధానంయిస్తారో ?

జేబుమీద చెయ్యివేసి గట్టిగా పట్టుకొన్నాడు.

"గోళీకాయ కనిపించలేదు, ఎట్లా పోయిందో"—అన్నాడుపిల్లవాడు.

"నే చూడలేదు నాయనా, గోళీ, నాకు దొరికితే మీ కివ్వక వెధవ గోళీ నేనేం చేసుకొంటాను. వెతకండి నాయనా, ఉంటుందిలెండి..." అని వాళ్ళకు ధైర్యం చెప్పి, తాను ధైర్యం తెచ్చుకొని ముందుకు సాగిపోయాడు.

ఒక్క గోళీకాయఅగుపించకుంటే ఆ పిల్లకాయలు ఆ విధాన్న అల్లాడి పోతున్నారే, అర్థరూపాయికాసు పోగొట్టుకొన్నవా ళ్ళెంత దుఃఖించి పోతున్నారో !

అదే భగవంతుని సృష్టిలోగల వైచిత్ర్యం.ధనమనే వస్తువుని సృష్టించి మానవుల్ని ఏడిపిస్తూ నవ్విస్తూ ఉంటాడు భగవంతుడు. ఆహా ! ఏమి లీలలురా నీవి భగవంతుడా ? ఏమి లీలామానుషవిగ్రహుడవోయీ ?

ఛీ ! ఛీ ! పాడు డబ్బు. దుఃఖభూయిష్ఠమైనది. ఈ అర్థరూపాయి కాసు ఎంత తొందరగా వదలించుకొంటే అంత శ్రేయస్కరం.

రామనామ తారకం
భక్తిముక్తి దాయకం
రామనామ ...

"కరుణకుమార"

గబగబా వెళ్ళిపోయాడు.

మరి యీ డబ్బును వదిలించుకోవడం యెట్లా?

తలెత్తి చూచాడు. రైలురోడ్డు మీద నిలబడి ఉన్నాడు. ప్రశాంతంగా ఉన్నదా ప్రదేశం. రైలుపట్టాల మీద కూర్చున్నాడు.

వదిలించుకోవడం ఎంతసేపు.క్షణం పట్టదు. కాని యేవిధంగా యీ అర్ధ రూపాయిని వదిలించుకోడం. దీని ఖామందెవరో తెలియకపోయె. ఏ బ్రాహ్మడికైనా దానం చేస్తే? లేక ఏ కుంటి, గుడ్డికైనా పిలిచి దానం చేస్తే? లేక ఓ అరడజను గజనిమ్మపళ్ళు కొని దేవాలయంలో స్వాముల వారికి సమర్పించి దణ్ణంపెట్టుకుంటే? లేక ఏ ధర్మసంస్థకైనా తన పేరు చెప్పి ధర్మం చేస్తే?

ఆలోచన తెగలేదు ఆచారికి.

దానం చేయడంలో సత్పాత్ర దానం చేయాలని అంటారు పెద్దలు. సత్పాత్రదానం ఎటువంటిదో స్వాములవారి నడిగి తెలుసుకొంటే?

పడమరగా తిరిగి మోకాళ్ళమీద మోచేతులానించి గడ్డంక్రింద చేతులు పెట్టుకొని దీర్ఘాలోచనలో పడ్డాడు వేదాంతి.

ప్రొద్దు పడమటికొండలు దాటింది.

ఎవరో చేతిలో కర్ర టక్కుటక్కున కొట్టుకొంటూ యేదో వెతుక్కుంటూ వస్తున్నారు.

ఏమిటి చెప్మా, అతడట్లా వెతుక్కొంటున్నాడు?

ఆచారి దేహం ఉడుకెత్తింది.

జేబులో చెయ్యి వేసుకొని చూచుకొన్నాడు. అర్ధ రూపాయిక్కూడా ప్రాణముండి, క్షణక్షణం పెరుగుతూ ఉంటుందిగాబోలు— దిమ్మచెక్కలా చేతికి తగిలింది.

ఆ వెదికే మనిషి అతని సమీపంలోకి వచ్చాడు.

"ఏమిటి గంగయ్యా! చీకటిపడి వెతుక్కుంటున్నావు?" అని అడిగేడు ఆచారి.

"బర్రెదూడ తప్పించుకొనివచ్చింది సామీ, ఏడ యెతికినా కానరాలేదు. ఏ రైలుకిందైనా పడి చచ్చిందేమోనని యిట్లా వచ్చా" అన్నాడు గంగయ్య.

"నా కగుపించలేదయ్యా నీ దూడ. చూస్తే చెప్పనూ. దాచిపెట్టుకొనే వస్తువుగనక నా. పాపం! నిక్షేపంవంటి దూడ. ఎట్లాపోయిందోగదా..." అని ఆచారి ఓదార్చే సమయంలో, "నీ కోసం ఊళ్ళో పోలీసులు చెడ వెతుక్కుంటూవుంటే నువ్వు యీ డుండా వేమిటి?..." అన్నాడు గంగయ్య.


ఆచారి ప్రాణాలు-నిలువునా ఎగిరిపోయినవి. పోలీసులేమిటి, తనకోసర మేమిటి, వెతుక్కోవడ మేమిటి? ఈ అర్ధరూపాయి నాకు దొరికిందని వాండ్లకెవరు చెప్పారు? ముచ్చెమటలుపోసి, లేచి నిలబడ్డాడు, ఆచారి.

"నా కోసరం పోలీసులు వెతకడ మేమిటి గంగయ్యా?"

"మీ ఇంటిప్రక్క జంగం కోటయ్య ఇల్లు పోలీసులు సోదా చేస్తున్నారు."








"ఎందుకు?"

"నీకు తెలుసుటగా, ఈ సందుకట్ల జంగం కోటయ్య దొడ్లో వరలబావి కుంచుతుంటే, భూమిలో ముంతతో ముంతెడు బంగారు సవర్లు దొరికినాయటగా?"

"ముంతెడు బంగారమే..." అని గుండెలు బాదుకొన్నాడు—ఆచారి.

"ఏమీ తెలియనట్లే మాట్లాడుతా వేం? మీ ఇంటిప్రక్కనేగా అది దొరికింది? ఇట్లా ఇట్లా కోటయ్యకి బంగారం నిధి దొరికిందని మునసబే పోలీసులకు రిపోర్టు చేశాడట."

"పోలీసులకు రిపోర్టు చేయడం ఎందుకు?"

"ఎందుకేమిటి? ఎవరికెక్కడెక్కడ ఏయే వస్తువు దొరికినా అవన్నీ సర్కారుకు చెందవలసిందేనట."

"అయితే గంగయ్యా, నా కో సందేహం, చెప్పూ... ఇప్పుడు నువ్వే ఉన్నావు. దారిన పోతుంటావు నీ కెక్కడయినా ఓ పేడో పావలో దొరుకుతుందనుకో. దాన్ని పోలీసుల కప్పగించవలసిందేనా?—"

"అట్లా అప్పగించ లేదనేకదూ పోలీసులు కోటయ్య యిల్లు సోదా చేయడం?"

"సోదాలో బంగారం దొరికిందా?"

"దొరకలేదు. కోటయ్య నాకు దొరకలేదంటున్నాడు. నీవు చెప్పేది అబద్ధం, నిజం చెప్పుతావా చెప్పవా అని పోలీసులతన్ని చితకాచితగా చావగొట్టుతున్నారు."

"నా కోసరం పోలీసులెందుకు వెతుకుతున్నారు గంగయ్యా?"

"నీది పక్కయిల్లేగా. బంగారం సంగతి నీకు తెలియకుండా పోదని అన్నారు మునసబు కరణాలు—" అంటూ గంగయ్య వెళ్ళిపోయాడు.

తుఫాను రేగింది ఆచారి మనస్సులో. జేబు లో అర్ధరూపాయి అరవీసె బరువెక్కినట్టుంది — అర్ధరూపాయి!

ఊళ్ళోకి పోవడమా మానడమా? అక్కడ నిలవలేక పోతున్నాడు. లేచి వెళ్ళలేక పోతున్నాడు. అతనికి వెర్రి చూపులు పడిన్నై. అర్ధరూపాయి అక్కడ విసిరి పారేద్దామని బైటికి తీశాడు. అట్లా పారెయ్యడం అదొక నేరమౌతుందేమో. దొరికిన డబ్బెందుకు పారేశావని పోలీసులు చేవడా లెక్కదీస్తారేమో.

గబగబా రైలుకట్టదిగి రోడ్డెక్కాడు విసురుగా చేతులూపుకొంటూ బయల్దేరాడు. నాలుగురోడ్లు కలిసేకూడలి. పోలీసు జవాను నిలబడి రహదారి కంట్రోలు చేస్తున్నాడు. వేదాంతాచారి తల పైకెత్తి ధైర్యంగా పోలీసు జవాను కెదురుగా నడిచి వెళ్ళేడు. పోలీసు జవాను - ఒక చెయ్యెత్తి, రెండోచెయ్యి అడ్డంగా పెట్టి నిలబడ్డాడు. ఆచారి సమీపించాడు.

'నేనేమీ దొంగతనం చేయలేదు, దోపిడి చేయలేదు. వేణుగోపాలస్వామి ఆలయంలో నుంచి వస్తుంటే వీధిలో దొరికింది నాకీ అర్ధరూపాయి. దీని కామందెవరో అని నేను వెద వెదికాను. మీరే విచారించి, యీసొత్తు ఎవరిదో వారి కిప్పించం'డని అర్ధరూపాయి తీసి పోలీసు జవాను చేతిలో పెట్టేడు — ఆచారి.

గుప్పిడిమూసి.... 'ఫో, ఫో ... తొందరగా ఫో, మోటార్లు వస్తున్నవి. అడ్డులే'... అని తరిమిగొట్టాడు — పోలీసు జవాన్.

పెద్ద నిట్టూర్పు విడిచాడు ఆచారి. బ్రతుకు జీవుడా అనుకొన్నాడు. జేబు ఖాళీ అయిపోయింది. శరీరం తేలికయింది.

ఇంటికివచ్చి, లోపల అడుగుపెట్టి పెట్టడంతో,— 'ఏమండీ, సబ్బుబిళ్ళ తెచ్చారా ?'— అని భార్య అడిగింది.

'సబ్బుబిళ్ళేమిటి ?'— తెల్లబోయాడు ఆచారి.

'వాళ్ళు రుద్దుకొనే సబ్బయిపోతే, మీరు వచ్చేటప్పుడు బజారికిపోయి ఓ బిళ్ళ తీసుకొని రావలసిందని అబ్బాయిచేత అర్ధరూపాయిచ్చి దేవాలయంలో మీరున్నారంటే పంపేను. మీకివ్వలేదూ?'

'నా కివ్వలేదే!'

'అబ్బాయీ, నీకిచ్చిన అర్ధరూపాయేంచేశావురా?— అని అడిగింది తల్లి.

'అర్ధరూపాయి కాను చేతిలో పెట్టుకొని నేను దేవళం కాడికి పోయేవరకు, అక్కడ గూటీబిళ్ళ ఆడుకొనేపిల్లకాయలు పరుగెత్తుతూ వచ్చి నామీద పడ్డారే అమ్మా, నేను కింద పడిలేచి చూచుకొంటే, చేతిలో అర్ధరూపాయి అగుపించలేదే ?' ... అంటూ బావురుమన్నాడు పదేళ్ళ కొడుకు.

□□□

'భారతి' మొదలైన సుప్రసిద్ధ మాసపత్రికలలో అనేక కథలు ప్రచురించి లబ్ధప్రతిష్ఠులై, కొన్నాళ్ళక్రిందట కీర్తిశేషులైన శ్రీ 'కరుణ కుమార' రచించిన ఆఖరి అముద్రిత కథ ఇది.



# సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

( గతసంచిక తరువాయి )

'అబద్ధం—కాదు—కాదు— అబద్ధం—' జయంతి హఠాత్తుగా బామ్మ వైపు పరుగెత్తబోయింది.

'జయంతీ!' దానికోసమే చూస్తున్నట్టు శేఖరం ముందుకు వచ్చి జయంతిచేతిని గట్టిగా పట్టుకున్నాడు.

'వదలండీ ! నన్ను వదలండి. మీరు చెప్పింది అబద్ధం' అంటూ జయంతి బలంగా పెనుగులాడి అతని చేతిని వదిలించుకుని వెళ్ళి బామ్మగారి మీదపడి యేడవసాగింది.

డాక్టరు ఇవతలకి వచ్చేస్తుండగా 'ఎవరు వాళ్ళు, మీ చుట్టాలా ?' అని అడిగాడు.

'అవును. మా అమ్మకి ఆవిడ పినతల్లి—కొద్దిరోజులక్రితమే తెలిసింది. తెచ్చి దగ్గర పెట్టుకున్నాను' అన్నాడు శేఖరం పరధ్యానంగా.

'అలాగా! అయితేకావలసినవాళ్ళే నన్నమాట' అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

అతన్ని పంపించేసినతర్వాత శేఖరం ఒక నిమిషంపాటు వరండాలో ఆగిపోయాడు. లోపలనుంచి జయంతి యేడుపు హృదయవిదారకంగా విన్పిస్తోంది. ఆవిడ ఎన్నోసార్లు జయంతికి యీ విషయం చెప్పేస్తానంటే తనెందుకు వారించాడు ? ఏ శనిదేవత తన నాలుక మీద కూర్చుని ఆ మాట అన్పించింది? ఇప్పుడు చెబితేమటుకు జయంతినమ్ముతుందా? అయినా ఎంత హాస్యాస్పదంగా వుంటుంది ! అసలే అనుకోకుండా జరిగిన ఒకటి రెండు సంఘటనలతో జయంతికి తనమీద నమ్మకంపోయింది. బంధుత్వంద్వారా కాకుండా తన వ్యక్తిత్వంద్వారా ఆమెకి దగ్గిరవాలని ఆశించాడు.

శేఖరం మెల్లగాలోపలికివచ్చాడు. బామ్మగారి శవాన్ని చూసేసరికి అతని కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగాయి. జయంతికి ఆ సుస్తీ రాకపోతే యీ బంధుత్వమే తెలిసేదిగాదు. ఈ కొద్దిరోజుల్లోమాతృత్వంలోని మధురిమని, నా అనేవాళ్ళు చూపించే ఆప్యాయతని చవిచూశాడు తను.

జయంతి కిష్టంవున్నా లేకపోయినా, యీ క్షణంనుంచి బాధ్యత తనది అనుకున్నాడు.

"నేనేం చెయ్యను బామ్మా! నేనేం చెయ్యాలి? ఎలా బ్రతకాలి? మాట్లాడు బామ్మా" జయంతి ఆవిడ గుండెలకేసి తలగొట్టుకుంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ ఓగరగా యేడుస్తోంది. ఇంతలో యెవరోవచ్చి బలంగా వున్న చేతులతో జయంతి భుజాలు పట్టి మెల్లగా బామ్మగారి నుంచి యివతలకి యెత్తారు. జయంతి తలెత్తి చూసింది. శేఖరం కళ్ళు జయంతి కళ్ళతో కలిశాయి. అతని కళ్ళు ప్రపంచంలో వున్న ఆప్యాయతని, జాలిని నింపుకున్నట్టు వున్నాయి.

"జయంతీ!" అతనికంఠంలో బాధ స్పష్టంగా కన్పిస్తోంది.

"బామ్మని వదిలి నేనెలా వుండగలను" రెండు చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది.

"నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి." శేఖరం జయంతి తలని దగ్గరకి తీసుకుని గుండెలకి హత్తుకున్నాడు. ఏం చెప్పటానికి అతనికి కూడా మాటలు పెగలటంలేదు. జయంతి పైకి యేడుస్తోంది. అతను మనసులో యేడుస్తున్నాడు. అంతేభేదం.

"బామ్మా! యిది-యిది నిజం కాదని చెప్పండి. ఇంకో డాక్టరికి చూపించండి" అతని గుండెలకు అంటుకు పోయిన జయంతి వెక్కుతూ అంది.

ఓ గంట క్రితం యెవరైతే తనని నిర్లక్ష్యంగా చూస్తున్నాడని భుజాల మీద సూదితో గుచ్చి బాధ పెట్టాలనుకుందో అతనే యిప్పుడు బలంగా వున్న తన రెండు చేతులు పెనవేసి ధైర్యం చెబుతున్నట్టు పొదివి పట్టుకున్నాడని జయంతికి తెలియలేదు, గుర్తుకు రాలేదు.

● ● ●

బామ్మగారి దహన క్రియలు శేఖరం తన చేతిమీదుగానే స్వయంగా ముగించాడు. ఆవిడ పోయిందనే వార్త అందరికీ, ముఖ్యంగా వనితా విహార్ వాళ్ళకి అశనిపాతంలా తగిలింది. ఈ మరణంతో దిక్కులేని జయంతి శేఖరానికి మరింత దగ్గరై పోతుందనే భయం, బాధ యెక్కువైనాయి.

"ఇప్పుడేమిటి చేయటం?" అంది మిసెస్ కరుణాకరం.

"మనంవెళ్ళి చూసివద్దాం. మెల్లగా ఆపిల్లని మనలో కలుపు కోవటం మంచిది." అంది రేఖారాణి.

మిసెస్ కరుణాకరం సరేనంది. ఆవిడకి కావలసిందల్లా ప్రమీలతో రాజశేఖరానికి ఆ మూడు ముళ్ళు పడటం. తమకున్న ఆస్తితో ఆతని ఆస్తిపాస్తులు కలిసి పోవటం. ఎలాగైనా యీ వివాహం జరిపించే బాధ్యత నాది అని రేఖారాణి వాళ్ళకి వాగ్దానం చేసింది. జయంతి శేఖరం దగ్గర సెక్రటరీగా చేరిందని తెలిసిన రోజునే ఆవిడ రేఖారాణిని నిలవదీసింది. "ఆగు వుండనీ! యేం ఫర్వా లేదు. నేను చెబుతున్నాను గదా! శేఖరానికి ఆ అమ్మాయిమీద జాలి తప్ప యింకేంలేదు. వనితావిహార్‌లో మిష్టర్ వర్మద్వారా జయంతికి జరిగిన అవమానం అతనికి తెలిసింది. ఆ కోపంతోనే ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో తనంతట తనే పిలిచి ఉద్యోగం యిచ్చాడు. దానికి మన మేమయినా అనుకుంటున్నట్టు బైటపడితే యింకొంచెం రెచ్చిపోతాడు. అందుకే జయంతి సెక్రటరీగా చేరిందన్న విషయం మనం అసలు గుర్తించనట్టు, గుర్తించినా పట్టించుకోనట్టు వుందాం" మని చెప్పింది.

"అసలు ఆ మిసెస్ వర్మ యింటికి ఆరోజు ఆ అమ్మాయి వెళ్ళకపోతే యేగొడవా వుండేదికాదు. ఎప్పటికీ వనితావిహార్ సెక్రటరీగానే వుండిపోయేది." విసుగ్గా అంది మిసెస్ కరుణాకరం.

"అవును, కాని వ్యవహారం యింత దూరం పోతుందని యెవరికి తెలుసు? రాజశేఖరం యీ విషయంలో జోక్యం కల్పించుకుంటాడని మనం కల్లోనైనా అనుకున్నామా!" అంది రేఖారాణి.

"అవుననుకో — కాని యిప్పుడు మనం చేయాల్సిం దేమిటి?"

చెప్పానుగా! మెల్లగా అ అమ్మాయిని మనలో కలుపుకున్నట్టు కలుపు

---

## "సెక్రటరీ"

### సీరియల్ - జరిగినకథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బామ్మ. జయంతికి వనితా విహార్‌లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాండ్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచి వాడు. అతని వద్ద ఉద్యోగం మొదట బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకొనడం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని ఆనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బామ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటి నుంచి వెళ్ళిపోవాలనుకుంటుంది. ఇంతలో ఆమె బామ్మ హఠాత్తుగా గుండెజబ్బు వచ్చి చనిపోతుంది.

---

కుని శేఖరంనుంచి దాటించాలి. రేపు వెళ్ళి చూసి పలకరించి వద్దాం."

"సరే!" మిసెస్ కరుణాకరానికి రేఖారాణి బుద్ధి సామాన్యమైంది కాదని తెలుసు. దానిమీద నమ్మకంతోనే యింకేమీ అడగలేదు. శేఖరానికి ప్రమీలని యివ్వటానికి ఆటంకం కలుగుతుందేమో నన్న భయం సడలలేదు.

"మనతోపాటు సుమిత్రా దేవిని గూడా కలుపుకుందాం" అంది రేఖారాణి యేదో ఆలోచిస్తూ.

రేఖారాణి మర్నాడు ఫోన్‌చేసి సుమిత్రా దేవితో "మనం వెళ్ళి ఒకసారి జయంతిని చూసివద్దాం" అంది. ఆవిడ కీ లోతుపాతులేం తెలియవు. "అవునవును. తప్పకుండా వెడదాం" అంది. ఈ మధ్య శేఖరం వనితా విహార్ విషయాలపట్ల చాలా అశ్రద్ధ కనబరుస్తున్నాడు. అది జయంతిని తీసెయ్యటంవల్లనేమోనని ఆవిడ అనుమానం. జయంతిమీదఅతని కేమాత్రం ఆసక్తివుందని తెలిసినా తను ఆఅమ్మాయిని వదిలేదా! పోనీ ఈ రూపేణా మళ్ళీ కలుపుకోవటం మంచిది అనుకుంది.

జయంతిని చూడటానికి వెళ్ళాలి అనుకున్న యీ ముగ్గురిలో మనసులో యెవరికి వాళ్ళకే వాళ్ళనిగురించిన స్వార్థపు టాలోచనలు వున్నాయి. కాని అవి యేమాత్రం బైటపడకుండా యెదుటివాళ్ళ మాటని మన్నిస్తున్నట్టు మాట్లాడుతున్నారు.

● ● ●

...వాళ్ళంతా వచ్చేసరికి అదృష్ట వశాత్తు యింట్లో శేఖరం లేడు. జయంతిదగ్గర సునంద, శివరామ్ వున్నారు. వాళ్ళని చూస్తూనే జయంతి కళ్ళు వెడల్పయినాయి. సునంద జయంతివైపు చూసింది. శివరామ్ లేచి సవినయంగా ఆహ్వానించాడు.

అందరూ కూర్చున్నారు. అంతటా నిశ్శబ్దం. ఎవరికి యేం మాట్లాడాలో తోచటంలేదు.

చివరికి రేఖారాణి తనే "పాపం! మీకు బొమ్మ తప్ప యింకెవరూ లేనట్టున్నారు. అది చాలా విషాదమైనసంగతి" అంది. జయంతి కళ్ళు వాలిపోయినాయి.

"అసలు గుండె జబ్బని మాట మాత్రం మా కెవరికి తెలిసినా యెవర్నయినా మంచి డాక్టర్‌కి చూపించే వాళ్ళం. మా చుట్టాల్లోనే గుండెకి సంబంధించిన స్పెషలిస్ట్ ఒకాయన వున్నాడు"అంది మిసెస్ కరుణాకరం.

"ఇంత చిన్నవయసులో—ఇలాంటి బాధ లొస్తే మనసు మోడుబారిపోతుందికూడా! ఐనా నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి" అంది సుమిత్రా దేవి.


"అబ్బ! నీ స్థితిలో మా ప్రమీలని వూహించుకుంటే నా గుండె బద్దలైపోతుంది"అంది మిసెస్ కరుణాకరం.

"ఏమిటో అంతా ఆ భగవంతుని మాయ! ఓసారి ఆలోచిస్తే యీ ప్రపంచంలో యెవరికి యెవళ్ళు అనిపిస్తుంది" సుమిత్రా దేవి.

"నువ్వు మరీ యిలా వంటరిగా వుండటం మంచిదిగాదు. కాస్త అప్పుడప్పుడు అలా మా యిళ్ళకేసి








వస్తూండు. మనుష్యుల్లోపడ్తే కాస్త మనసు తేరుకోవచ్చు." రేఖారాణి.

జయంతికి తన చెవులు తనకే మోసం చేస్తున్నాయేమోననే భ్రమ కలిగింది. వాళ్ళు చాలాసేపు కూర్చున్నారు. అందరిలోకి యెక్కువగా రేఖారాణి మాట్లాడింది. శివరామ్ మధ్య మధ్యలో జవాబులిచ్చాడు. జయంతి, సునందా వింటూకూర్చుండిపోయారు.

వాళ్ళు "చాలా టైమైంది" అంటూ లేచి వెళ్ళబోతూ మళ్ళీ తప్పకుండా వచ్చి వాళ్ళందరితో కలవమని యింకోసారి గట్టిగా చెప్పి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత గుమ్మందాకా సాగనంపి వెనక్కి తిరిగి వస్తున్న శివరామ్ "మీమీద హఠాత్తుగా యింత ఆపేక్ష వచ్చేసిందేమిటి వీళ్ళకి?" అన్నాడు నవ్వుతూ.

"అదే నాకూ అర్థంగావటంలేదు" అంది జయంతి.

"వీళ్ళని చూస్తుంటే చాలా మంచి వాళ్ళు లాగానే అన్పిస్తున్నారే" అంది సునంద.

"పయోముఖ విషకుంభాలు. వాళ్ల మాటలు నమ్మకండి. ఈ రావటంలో తప్పకుండా యేదో యెత్తు వుండి వుంటుంది. బైట వీళ్ళు జయంతి పేరిట యెంతెంత ప్రచారాలు యెంత అసహ్యంగా చేస్తోందీ నాకు తెలుసు" అన్నాడు తీవ్రంగా.

'అలాగా!' అంది సునంద తగ్గుతూ.

'పోనిండి నన్నేం చేస్తారువాళ్ళు' జయంతి వుదాసీనంగా అంది—బామ్మ గారి మరణం అసలు ఆమె ఆలోచనల మీదనే వేదాంతపు తెర దింపేసింది.

ఈ ఇకాస్త జీవితానికి యిన్ని కొట్లాటలా! జనన మరణాల మధ్య అత్యంత అల్పమైన యీ జీవిత బుద్బుదం కోసం ఆశానిరాశల మధ్య యింత వూగిసలాటా? ఛీ! ఛీ! దేని కోసం బాధపడకూడదు. దేనికోసం దిగులు పడకూడదు. మనసుకి నేర్పిన పాఠాన్ని వల్లె వేసుకుంటోంది జయంతి.

శివరామ్ వెళ్ళబోయేముందు అదోలాకూర్చున్న జయంతినిచూస్తూ 'మీరు ధైర్యం తెచ్చుకోవాలి. మరీ యిలా జారిపోకూడదు' అన్నాడు.

'నేను ధైర్యంగానే వున్నానుగా! చూడండి. లేకపోతే—' వాక్యం పూర్తిచెయ్యకుండానే పేలవంగా నవ్వేసింది.

'ఉన్నానంటే సరిపోతుందా! ఉందీ లేందీ మీమొహం మాకు చెప్ప టంలా!' అని క్షణంసేపు ఆగి 'ఏమి టండీ! మనలో యెవరు శాశ్వతం! మీరు శాశ్వతమా! నేను శాశ్వ తమా! మనమే కానప్పుడు ఇంకోళ్ళ కోసం బాధపడటం యెంత వెర్రితనం! కాబోతే మీకు ఆవిడలేని లోటు బాగా తెలుస్తుంది. అది నేనూ ఒప్పు కుంటాను. కాని ఆ లోటు భర్తీచేసు కోటానికి మార్గం చూసుకోవాలి. అదీ మీరు చేయాల్సిన పని. కనీసం ప్రయత్నంచేసి చూడండి' అన్నాడు.

అతను వెళ్ళిపోయింతర్వాత అంత వరకూ బొమ్మలా బిగబట్టుకుని కూర్చున్న జయంతి ఒక్కసారి వెక్కి వెక్కి యేడవటం మొదలుపెట్టింది.

'ఛీ—ఛీ! ఏమిటది? పిచ్చి దానిలా—అదుగో! వాళ్ళు చెప్పిం దంతా అప్పుడే మర్చిపోయావా?' అంది సునంద జయంతి తలని ఒళ్ళోకి లాక్కుంటూ.

జయంతి సమాధానం చెప్పలేదు. చాలాసేపయింతర్వాత సునంద మరో సారి కేకలు వేయటంతో దుఃఖాన్ని నిగ్రహించుకోటానికి ప్రయత్నిస్తూ 'లేదు సునందా! కాని—కాని, నే నెక్కడుండాలి? ఏం చెయ్యాలి? ఎవరికోసం బ్రతకాలి చెప్పు—' అంది అస్పష్టంగా.

'ఎవరికోసం బ్రతకటం అనేది అర్థంలేనిప్రశ్న. ఎక్కడుండాలి అనేది ప్రస్తుతం అనవసరమైన ఆలోచన. ఏం చెయ్యాలి అంటే, కానీ—కొద్ది రోజులు పోనీ—చూద్దాం!' అంది సునంద.

'నే నెక్కువరోజులు ఇక్కడుంటే యేం బాగుంటుంది?'

సునందకి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. అవును నిజమే! అవివా హితుడైన శేఖరందగ్గర వంటరిగా యెక్కువరోజు లుంటే యెలాగుం టుంది? ప్రపంచం ఏమనుకుంటుంది! అదేం అతను ఆలోచించటంలేదా? ఒకవేళ ఆలోచించినా జయంతి పరి








స్థితులపట్ల జాలితో పట్టించుకోవటం లేదా?

'పోన్లే! నువ్వు కొంచెం తేరు కునేవరకూ మా యింట్లో నా దగ్గర వచ్చి వుంటావా పోనీ—' అంది.

జయంతి సమాధానం యివ్వలేదు.

శేఖరం వచ్చేవరకూ వుంది సునంద. బామ్మగారి మరణంతో వాళ్ల కుటుంబం అతనికి బాగా దగరగా వచ్చింది. సునంద భర్తకి శేఖరం అంటే మొదటి చూపులోనే సదభి ప్రాయం యేర్పడింది.

శేఖరం అప్పుడప్పుడు బైట పనుల మీద వెళ్ళాల్సి వచ్చినప్పుడు తిరిగి రావడం చాలా ఆలస్యం అవుతుంది. సునందకి అనుకున్నపుడు కబురు చేస్తాడు. అతను తిరిగి వచ్చేవరకూ సునంద జయంతి దగ్గరే వుంటుంది. శేఖరం వచ్చేసింతర్వాత సునందని కారిచ్చి యింటికి పంపిస్తాడు. ఆ పంపేటప్పుడు అత్తగారికి పళ్లు, పిల్ల లకి బిస్కెట్స్ బుట్టనిండావుంటాయి.

'ప్రతి రోజూ యేమిటండీ యివన్నీ—' శేఖరం యిచ్చినవి తీసు కోటానికి బిడియ పడుతూ అంది సునంద.

'పర్వాలేదు లెండి. ఇంటికి వెళ గానే పిల్లలు యెదురు వస్తారు. మీ రింతసేపు వాళ్ళని వదిలి పెట్టి వున్నారు.'

'నేను వెళ్ళేసరికి వాళ్ళు నిద్ర పోతారు. అయినా జయంతిని యీ సమయంలో యీ కాస్తయినా ఆదు కోవడం నావిధి అనుకుంటాను. జయంతి నాకు స్నేహితురాలు, అనే

సంగతి మీరు మర్చిపోతున్నారులా వుంది."

"లేదు. కాని ఒకరికి సహాయపడటంలో మనకి యిబ్బంది కలగకుండా చూసుకోవాలిగా!" అని కాసేపు ఆగి "ప్రస్తుతం ఆమెకి మీకంటే దగ్గర వాళ్ళెవరూ లేరు. మీరు సాధ్యమైనంతవరకూ ఆమెతో గడపటానికి ప్రయత్నించండి. దానివల్ల మీకే యిబ్బంది కలగకుండా చూడటం నావిధి అని నేను అనుకుంటాను," అంటూ పళ్ళబుట్ట డ్రైవర్ని కారులో పెట్టమని సునందతో "నా తృప్తి కోసం నేనేదో యిస్తుంటాను. దాన్ని మీరు కాదనకూడదు. పిల్లలకి మావయ్య పంపాడని చెప్పండి" అన్నాడు.

కారు వెళ్ళిపోయింది. శేఖరం లోపలికి తిరిగివచ్చాడు. జయంతి కూర్చున్న చోటనే అలాగే బొమ్మలా చలనం లేకుండావుంది.

"భోజనం చేద్దాంరా!" అన్నాడు శేఖరం.

"వద్దు."

"ఎందుకని?"

"నాకు ఆకలిలేదు."

"సరే నేనూ మానేస్తాను."

"మీరెందుకు మానెయ్యాలి!"

"నువ్వు తినకుండా నేనెలా భోం చేయాలి!"

జయంతి క్షణంసేపు అతని వైపు చూసి లేచివచ్చింది.

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు.

"ఈరోజు సుమిత్రాదేవి వాళ్ళూ వచ్చారు" అందిఅన్నం కెలుకుతూ.

శేఖరం కనుబొమలు కొద్దిగా ముడిపడ్డాయి. కాని మొహంలో యే భావం కన్పరచకుండా "నెయ్యి కావాలా?" అని అడిగాడు.

"వద్దు"

"కూరవేసుకో—"

"వుంది చాలు"

"పోనీ పెరుగు వేసుకో—" పెరుగు తీసి జయంతి వద్దని వారించబోయే లోపలే ప్లేటులో గుమ్మరించేశాడు. కాని అది జయంతి తిననేలేదు. నంజుతూ కూర్చుంది.

భోజనాలైన తర్వాత పడుకోబోయేముందు

"నన్నెక్కడికైనా పంపించెయ్యండి" అంది.

"ఎక్కడికెడతావు?"

"ఎక్కడికైనా సరే!"

"ఈ యిల్లు తప్ప. అవునా—?" అన్నాడు శేఖరం.

జయంతి మాట్లాడలేదు. "పోనీ నువ్వు ఫలాన చోటని చెప్పు" అన్నాడు.

"సునందా వాళ్ళింటికి—"

"ఆయింట్లోనా! అంత చిన్న యింట్లో— ఆ గొడవలో— నాకిష్టం లేదు. నువ్వెళ్ళబోయే చోటు తప్ప





కుండా నీకు మనశ్శాంతి యిస్తుందని నాకు నమ్మకం కుదరాలి—"

"పోనీ హాస్టలయితే—" ఆలోచిస్తూ అంది.

శేఖరం చేతిలో పుస్తకంలోకి చూస్తుండి పోయాడు.

"కొద్దిరోజులు అక్కడుంటాను. తర్వాత యెక్కడైనా ఉద్యోగం దొరికితే—ఆ తర్వాత మెల్లగా—"

"జయంతీ! ఈ యింటిమీద నీకప్పుడే అంత అసహ్యం యేర్పడిందా? లేకపోతే నా మీద—" శేఖరం ఆగిపోయాడు.

"లేదు—లేదు—అసహ్యం నాకెందుకుంటుంది? పైనుంచి నాకు మీ రింత సహాయం చేస్తూంటే—" కళ్ళల్లో నీళ్ళు తిరిగిగాయి. వెంటనే దిండులో మొహం దాచేసుకుంది.

శేఖరం పుస్తకం మూసి ప్రక్కన పెట్టి లేచిదగ్గిరగా వచ్చాడు. "చూడు. కొద్దిరోజులు ప్రయత్నం చెయ్యి. ఈ యింటిలో వుండటంఅలవాటుచేసుకోగలవేమో!"

జయంతి మాట్లాడలేదు. పడుకుంది. తనకి నిద్రపట్టిందనితెలుసుకునేవరకూ అతను వెళ్ళడు. ఆ సంగతి జయంతికి తెలుసు. అంతవరకూ యెంత రాత్రయినాసరే అలా పడక్కుర్చీలో పడుకుని ఆ నీలిరంగు షేడ్ లైట్ క్రింద చదువుకుంటూనే వుంటాడు. అందుకే యీ రోజు కళ్ళుమూసుకుని నిద్రపోయినట్టు పడుకుంది. చాలాసేపయింతర్వాత అతను లేచి దగ్గిరగా వచ్చి చూశాడు. నిద్రపోయిందనుకుని తలక్రింద దిండ్లు సరిచేశాడు. ఆ సరిచేసేటప్పుడు అతను నిట్టూర్పు విడవటం జయంతి గమనించకపోలేదు దుప్పటి కప్పి, లైటు తీసేసి తలుపులు శబ్దంగాకుండా దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే కళ్ళు తెరిచింది. ఎన్నాళ్ళిలా? మరో ఆడదిక్కులేని యీ యింటిలో వంటరిగా యిన్నిరాత్రులు పవిత్రంగా గడిపారంటే లోకం నమ్ముతుందా! శేఖరం తనతోపాటు వుండటానికి మరెవన్నయినా తీసుకురావటానికి యెందుకు ప్రయత్నం చెయ్యడు? అసలటువైపు ఆలోచించనట్టు— పట్టించుకోనట్టువుంటాడేం? కళ్ళముందు కన్పిస్తున్న యీ చీకటిలా, శూన్యంగా వున్న జీవితంలోకి వెలుగు యెలా తెచ్చుకోవాలి! ఏం చెయ్యాలి? కళ్ళు కాస్త తెరిస్తేచాలు పెద్ద పెద్ద కోరలతో, కత్తులాటి కొమ్ములతో, భయంకరంగా, వికృతంగా వున్న మృత్యువులాటి దేదో మీదికి వురకటానికి పొంచి కూర్చున్నట్టు అన్పిస్తుంది. కదలాలంటేనే భయం. ఒంటరిగా పడుకోటానికి అలవాటులేని జయంతికి అర్థంగాని భయంతో శరీరంలో రక్తం చల్లబడ్డట్టు, బిగుసుకుపోతున్నట్టు అనిపించసాగింది. ఛీ!—ఛీ! ఏమిటీ ఆలోచనలు! మరీ చిన్నపిల్లలాగా! ఈ కాస్తకే భయపడితే ముందు ముందు జీవితం అంతా వంటరిగా యెలా గడపాలి? ధైర్యం తెచ్చుకుంటూ నిద్రపోయింది.

అంతా అడివి. చుట్టూ, సూర్య

కిరణాలని చొరనీయకుండా దట్టమైన శాఖలతో పెద్ద పెద్ద వృక్షాలు. వాటి నిండా కొమ్మలకి కరుచుకుని వేళ్ళాడుతున్న భయంకరమైన పాములు ఎవరి కోసమో వెతుక్కుంటూ వచ్చిన జయంతి యీ అడివిలో దారితప్పి పోయింది. ఏం చెయ్యటానికీ పాలు పోవటంలేదు. భయంతో ప్రాణాలు బిగుసుకు పోతున్నాయి. ఇంతలో దూరంనుంచి యెక్కడినుంచో "జయంతీ!" అన్న బామ్మ కేక విన్పించింది. "బామ్మా!" బిగ్గరగా అరుస్తూ అటువైపు పరుగెత్తసాగింది. చెట్లకి వేళ్ళాడుతున్న పాములు తోకలతో జయంతిని కొట్టాలని చూస్తున్నాయి. అకారణంగా తనమీద వాటి కెందుకంత కోపం!

"జయంతీ!" మరోసారి కేక విన్పించింది.

"బామ్మా!" శబ్దంవచ్చినవైపు పరుగెత్తుకొచ్చిన జయంతి హఠాత్తుగా అంతదూరంలో ఆగిపోయింది. ఎదురుగుండా బామ్మకి బదులు పెద్ద సింహం కూర్చుని గడ్డం దువ్వుకుంటోంది.

"వచ్చావా! రా! నీ కోసమే చూస్తున్నాను." అచ్చు బామ్మకంఠంతో పిలుస్తోంది.

"అయితే—అయితే—నన్ను పిలిచింది—నువ్వా?"

"ఔను. నేనే. నాకు చాలా ఆకలి అవుతోంది" అంది సింహం.

జయంతి వెనక్కి వెనక్కి అడుగులు వేయసాగింది. సింహం లేచి ముందుకు వస్తోంది.

"నువ్వు—నువ్వు—"

"అర్థంగాలేదా? సింహానికి ఆకలవుతోంది అంటే నీకుతెలియడంలా? జాగ్రత్త! యింకో రెండడుగులు వెనక్కి వేస్తేయెక్కడుంటావో వెనక్కి తిరిగి చూసుకో." సింహం హెచ్చరించటంతో వెనక్కి తిరిగి చూసింది. వెనక పెద్ద అఘాతం! కళ్ళు తిరిగాయి. మళ్ళీ సింహంవైపు చూసింది.

"ఇప్పు డెక్కడికి వెడతావు?" వెకిలిగా యికిలించింది సింహం.

"వద్దు—వద్దు—" రెండుచేతులు జాపి వద్దన్నట్టు యేడవసాగింది.

"ఏడిస్తే నాకేం జాలికలగదు. నేను సింహాన్ని—" సింహం మీదకి వస్తోంది. ఖంగారుతో, భయంగా వెనక్కి అడుగులు వేసింది. అప్పుడు గుర్తుకొచ్చింది—అఘాతం వుందని! అప్పటికే కాళ్ళక్రింద భూమి లేదు. శరీరం గాలిలో తేలిపోసాగింది. భయంతో కెవ్వుమంది. ఈ లోపలే—అఘాతంలో పడకముందే ఎవరో రెండుచేతులూ జాపి బలంగా పట్టుకున్నారు. జయంతి యీసారి మరింత బిగ్గరగా కెవ్వుమంది.

"జయంతీ-జయంతీ" శేఖరం ఆదుర్దాగా పిలుస్తున్నాడు.

"వదులు-వదులు—ఎవరు-ఎవరు—" కలో, మెలకువో అర్థంకానిపరిస్థితిలో పెనుగులాడుతూ అంది.

"జయంతీ!" శేఖరం చేతులు ఉక్కు కడ్డీల్లా కదలకుండా బంధించటంతో అప్పటికి మెలకువ వచ్చింది.



అంత భయపడుతున్నా వేమిటి?" ఆదుర్దా నిండిన స్వరంతో అడుగుతున్నాడు అతను. ప్రక్కన నిలబడి నికృతంగా నవ్వుతున్న సింహం మెల్లగా క్రమేపి అదృశ్యమై గదిలో నీలంరంగు లైట్ గా మారింది.

"మీరు—మీరు—" ముఖంనిండా పట్టిన చెమటలతో, బెదురుతున్న కళ్ళతో అస్పష్టంగా అంది.

"ఏమిటిది? కలేమైనా వచ్చిందా?" జయంతి తలని దగ్గరకి తీసుకుని గుండెలకి అన్చుకుంటూ అన్నాడు శేఖరం.

"అవును. అవును. అబ్బ, ఎంత భయం వేసింది!" జయంతి గుండెలు యింకా దడదడా కొట్టుకుంటూనే వున్నాయి.

"ఏం కల అది? ఎంత బిగ్గరగా కెవ్వుమన్నావో తెలుసా?"

"మీనిద్ర చెడగొట్టానా?" నీరసంగా అంది.

"లేదు. నేనింకా నిద్రపోలేదు. ఇప్పుడిప్పుడే పట్టోంది. నీ కేకలువిని పరుగెత్తుకొచ్చాను. ఇంకా నయం. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి కాబట్టి సరిపోయింది." జయంతి నుదుటినిండా పట్టినచెమటని మెల్లగా తుడుస్తూ అన్నాడు.

"చాలా భయం వేసింది. అసలు చీకటిని చూస్తేనే భయంగావుంది"

"నాకు చెప్పలేదేం? ఇకనుంచి ఎల్లవార్లూ లైటు వుంచుతాన్లే—"

జయంతి మాట్లాడలేదు. కలనిగురించే ఆలోచిస్తోంది మనసు.

"ఏం కల అది? చెప్పు"

"పెద్ద అడివీ-అడివిలో చెట్లకి పెద్ద పెద్ద పాములు వేళ్ళాడు తున్నాయి."

"అవి నిన్ను కరిచాయా!"

"లేదు. ఇంతలో బామ్మ పిలుపు విన్పించింది."

"బామ్మా!"

"అవును"

"పిలిస్తే?"

"నేను పరుగెత్తుకుంటూ వెళ్ళాను. కాని అక్కడ బామ్మకి బదులు పెద్ద సింహంవుంది." చెబుతుంటే నే జయంతి వళ్ళు భయంతో జలదరించింది. ఆ జలదరింపును గుర్తించిన శేఖరం చేతులు మరింత దగ్గరికి తీసుకుని పొదివి పట్టుకున్నాయి.

"అప్పుడేమైంది? అది నీ మీదకి వురికిందా?"

"ఊహు. దాన్నిచూసి భయపడి నేను వెనక్కి వెనక్కి నడుస్తున్నాను. వెనకేముందో చూసుకో ఓసారిఅంది. నేను వెనక్కి తిరిగి చూశాను." శేఖరం వింటూండి పోయాడు.

"వెనక యింకో రెండడుగులువేస్తే పెద్ద అఘాతం వుంది. దాన్ని చూస్తేనే కళ్ళు తిరిగాయి. వెనక్కి తిరిగి సింహంవైపు చూస్తే అది నా మీదకి వస్తోంది. నేను వెనక్కి అడుగులు వేస్తూనే వున్నాను. అందులో పడిపోయాననే అనుకున్నాను. కాని

యెవరో బలంగా పట్టుకుని ఆపారు." గబగబా చెబుతున్న జయంతి వూపిరి పీల్చుకోడంకోసం ఆగింది.

"ఎంత చిత్రమైన కల!" అన్నాడు శేఖరం.

"ఇంకా చిత్రం యేమిటంటే—ఆ చేతులు—యిప్పుడు మీరు—మీరిలా పట్టుకున్నట్టే వున్నాయి."

ఈ మాటలు వింటూనే జయంతి భుజాల చుట్టూవున్న శేఖరం చేతులు అనుకోకుండా గట్టిగా బిగుసుకున్నాయి.

జయంతి మాట్లాడటం మానేసింది. శేఖరం ఆలోచిస్తూండి పోయాడు. ఉక్కు కడ్డీల్లావున్న అతని చేతుల మధ్య అలావుంటే అదేదో పెద్దకోట గోడమధ్య వున్నట్టుగావుంది. అతని ఛాతీని ఆనుకునివున్న జయంతి చెవికి నిశ్చలంగా కొట్టుకుంటున్న అతని గుండె క్రమబద్ధంగా వినిపిస్తోంది. అదలా వింటుంటే చాలా నిబ్బరంగా, నిశ్చింతగా వుంది. అలాగే అతని చేతుల మధ్య నిద్ర పోనిస్తే బాగుండు ననిపించింది. కాని అతనిదేం తెలియనట్టు మెల్లగా జయంతిని జరిపి దిండుమీద తల పెట్టాడు.

"జయంతీ! ఇది చెప్పు. మొట్టమొదటిసారి వనితావిహార్‌లో మనం కలుసుకున్నప్పుడు కుర్చీమీద వాలిపోయివున్న నిన్ను లేపబోతే నాచేయి గట్టిగా రెండుచేతులతోపట్టుకున్నావు, గుర్తుందా!" జయంతి గుర్తున్నట్టు తలూపింది. అవును! ఎంత చిత్రం! అప్పుడు వంటరిగా దిగులుగా వున్న తనమీదకి వంగి ఎవరో "నీవు కావాల్సి కావాలిజయంతీ" అన్నట్టువినిపించింది. కళ్ళు తెరిస్తే యెదురుగుండా రాజశేఖరం! అప్పటిరాజశేఖరం, యిప్పుడు యీక్షణంలో యెదురుగుండా నిలబడిన యీ రాజశేఖరం, అచ్చు ఒకలాగానే వున్నారు.

"చెప్పు! అప్పుడు కూడా నీకీ కల వచ్చిందిగదూ!"

"ఏమిటుది?"

జయంతి మాట్లాడలేదు.

"చెప్పు. గుర్తులేదా?"

గుర్తు లేదన్నట్టు తలూపింది.

"వచ్చిన కల ప్రతిదీ నిజం కాకపోయినా, కొన్ని సంఘటనలు భవిష్యత్‌లో జరగబోయేవి వాటికి సూచనలుగా కన్పిస్తుంటాయి. జయంతీ! నువ్వు నాకొకటి వాగ్దానం చెయ్యాలి."

ఏమిటన్నట్టు చూసింది.

"ముందు ముందు జరగబోయే జీవితంలో నీ కెలాంటి విసుగుకలిగినా నువ్వు నా నీడని వదలగూడదు. వదలనని వాగ్దానం చెయ్యి."

శేఖరం చేయిజాచాడు. క్షణం సేపు అతనివైపు పరీక్షగా చూసిన జయంతి మెల్లగా చేయితీసి అతని చేతిలో వుంచింది.

"నాకు సాధ్యమైనంతవరకూ నీకే నొప్పి కలిగించకుండా వుండటానికి జాగ్రత్త పడతాను. ఒకవేళ నాకు తెలిసో, తెలియకో నీ కేదయినా బాధనిపిస్తే నేరుగా వచ్చి నా ముఖం మీద అడిగెయ్యి. అడిగేస్తావుకదూ!"

జయంతి సమాధానం చెప్పలేదు. శేఖరం తన చేతిలోవున్న పల్చటి అరచేతిని పరిశీలిస్తూ "పోనీ—సుఖంధా వాళ్ళని మనింట్లో వచ్చి వుండమంటే?" అన్నాడు.

"వాళ్ళందర్నినా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఔను. బొమ్మ స్మృతినుంచి నిన్ను తప్పించాలంటే నీ మనసుని బాగా సందడిలో—గందరగోళంగా వుంచాలి. అందుకే వాళ్ళు మనింటికి వస్తే బాగుంటుందేమోనని అనుకుంటున్నాను. సునంద భర్త చాలా మంచివాడు. నమ్మకస్తుడుగా కన్పిస్తున్నాడు."

జయంతి శేఖరం కళ్ళల్లోకి చూస్తూండిపోయింది.

"నే నింతక్రితం నిద్రపోయేవరకూ దీన్ని గురించే ఆలోచిస్తున్నాను. వాళ్లు మనింట్లోవుంటే నీకు సందడిగానూ వుంటుంది. వాళ్ళకి సుఖంగా ఉంటుంది. నాక్కాస్త నిశ్చింతగా కూడా అన్పిస్తుంది."

"కాని—కాని—"

"నా కేదైనా యిబ్బంది కలుగుతుందనేగా నీ అనుమానం? లేక ఎవరైనా ఏమైనా అనుకుంటారనా? నాక్కావలసింది నీ మనశ్శాంతి. నువ్వు మళ్ళీ మామూలుమనిషివి కావటం. అంతే."

జయంతికి యీ అభిప్రాయాన్ని బలంగా వ్యతిరేకించా లనిపించింది. కాని, యేం చెప్పాలో, యెలా చెప్పాలో తెలియలేదు. అయినా ఒకసారి నిర్ణయానికి వచ్చాడంటే అది మార్చడంఅనేది అంతసులభంకాదు. ఆ సంగతి జయంతికి తెలుసు. అప్పటికి మౌనంగా వూరుకుండిపోయింది.

జయంతి నిద్ర పోయిం తర్వాత శేఖరం లేచివచ్చి పడక్కుర్చీలో పడుకున్నాడు.

"ఇలాఎన్నాళ్ళు? పోనీ జయంతిని పెళ్ళి చేసేసుకుంటే?" అనిపించింది. కాని వెంటనే మనసు "వద్దు వద్దు. ఇప్పట్లో అలాటి తెలివి తక్కువపని యెప్పుడూ చెయ్యకు. ఆమె మనసు పూర్తిగా నీమీద లేదని తెలుసుకుని కూడా నువ్వు పెళ్ళిచేసుకుంటే? అనటం యేం బాగాలేదు. అదను చూసుకునిఆడుకున్నాను అనేనెపంతో ఆలోచించేందుకు అవకాశం యివ్వకుండా బంధించేశావని జయంతి ముందు ముందు నిన్నపార్థం చేసుకోవచ్చు. ఎంతకాలం అయినాసరే! ఆమె మనసులో నీపట్లగల దురభిప్రాయాలు తొలగిపోనీ! నీకు చాతనైతే సాధ్యమైనంత త్వరలో ఆ మాలిన్యం కడిగేసేందుకు ప్రయత్నించు. అంతేగాని—వివాహంమాట తలపెట్టకు. అపార్థాలతో మొదలైన వివాహాలు అనర్థాలకి దారితీస్తాయి. అందులో అశాంతి తప్ప సుఖం వుండదు." అని గట్టిగా హెచ్చరించింది. "అదిగాకుండా జయంతిలో వయసు వికసించినా మనసు వికసించలేదు.

పసితనం పూర్తిగా పోలేదు. ఇందాక నువ్వు అంత దగ్గరగా అంత గట్టిగా హృదయానికి హత్తుకున్నావు! అప్పుడు నీవైపుచూసిన ఆమొహంలో స్త్రీ పొందుతున్న గగుర్పాటుకాని— అనుభూతికాని నీ కేమైనా కన్పించిందా! వద్దు. వద్దు. పొరబడుతున్నావు. నీకు చాతనైతే సున్నితంగా ఆమెలో స్త్రీత్వాన్ని మేల్కొలిపే వుపాయాలు చూసుకో—" అంటూ వివేకంగూడా వంత పాడింది.

● ● ●

"జయంతీ! ఏమిటిది? శేఖరం మావారిని పిలిచి మీరంతా కుటుంబంతోసహా వచ్చి మాయింట్లో వుండండి అన్నట్టు మాట్లాడాడుట!" అంది సునంద మర్నాడు సాయంత్రం.

"ఆయనకి మతిపోయింది" పళ్ళ బిగువున వచ్చింది సమాధానం.

"అంటే?" అర్థంగానట్టు చూసింది సునంద.

"ఏంలేదు సునందా! నేనువచ్చి మీయింట్లో వుంటానంటే, వద్దని— మీ అందర్నీవచ్చి యిక్కడ వుండమంటున్నాడు. నాకు సందడి కావాలిట? అదీ ఆయనగారిఉద్దేశ్యం. జయంతి సునంద చేతిమీద చేయి వేస్తూ" సునందా! అతను నన్నేదో మనిషిని చేయాలనే ఉద్దేశ్యంతో యేవేవో వూహిస్తున్నాడు. అవన్నీ మీరు పట్టించుకోవద్దు. అతనికి లోకంతో లెక్క లేకపోవచ్చు. కాని మనం యెలా లెక్క చెయ్యకుండా వుండగలం! అంతా యేమనుకుంటారు? ఇదంతా మనిద్దరి ప్లాన్ అనుకోరూ!"

"ఏమిటీ నీ ఉద్దేశ్యం? అతను అడిగినంత మాత్రాన మేం వచ్చేసి వుంటామనే అనుకుంటున్నావా నువ్వు." వెనక్కి తగ్గుతూ అంది సునంద.

"లేదులే! కాని మీ ఆయన శేఖరం మాట కాదనలేక ఊ! అనేస్తాడేమోనని నా భయం."

"అలాటి భయాలు నీకేమీ అవసరం లేదులే. నీకు సందడి కలిగించాలని అదుకోవాలని అనుకుంటే మా యింటికే తీసుకెడతాం. ఉన్నంతలో చూసుకుంటాం. అంతేగాని—"

"నాకెక్కడికీ రావాలని లేదు సునందా! ఇక్కడుండాలనీ లేదు. మెల్లగా అతన్ని ఒప్పించి ఏ హాస్టల్లోనైనా జేరి యిక్కడినుంచి తప్పించుకోవాలని నా ఉద్దేశ్యం. సాధ్యమైనంత త్వరలో అది జరిగి తీరుతుంది గూడా!"


"అది అంత సులభం అని నేను అనుకోను" అంది సునంద.

రెండు రోజుల తర్వాత భోజనాల దగ్గర శేఖరం తనే అన్నాడు. "మనింటికి వచ్చి వుండటానికి సునంద యే మాత్రం యిష్టపడటం లేదుట! ఏమిటీ అభ్యంతరం?"

"నాకెలా తెలుస్తుంది!"

"అందులో నీ ప్రమేయం ఏమీ లేదా అని అడుగుతున్నాను."






"వుంటేమటుకు తప్పేముంది? అయినా! యిక్కడ నేనే వుండబోనప్పుడు—", జయంతి ఆగిపోయింది.

శేఖరం సూటిగా చూశాడు.

"నే నెక్కడికైనా హాస్టల్ కి వెళ్ళి వుంటాను" అంది అన్నం కెలుకుతూ.

శేఖరం మౌనం వహించాడు.

"హిమాయత్ నగర్ లో వర్కింగ్ వుమెన్ హాస్టల్ వుందిట! అందులో—" జయంతి వాక్యం పూర్తి చెయ్యనేలేదు.

"జయంతీ! నీ కిదివరకోసారి చెప్పాను. హాస్టల్ కి పంపటంయిష్టం లేదని."

"ఎందుకు?—"

"నువ్వందమైనదానివి. అమాయకురాలివి. సరేనా?"

జయంతి చురుగ్గా తలెత్తి చూసింది. శేఖరం మొహంలో పరిహాసం స్పష్టంగా కన్పిస్తోంది.

"నా కిష్టంవున్నా లేకపోయినా కొద్దిరోజులు నువ్వీయింట్లో వుండటం తప్పదు. అది బాగా తెలుసుకో—" భోజనం ముగించి చెయి కడుక్కోడానికి లేచి వెళ్ళిపోయాడు.

జయంతి రెప్ప వాల్చకుండా అన్నంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. ఏమిటీ అధికారం? ఎవరిచ్చారు! తను తిరగబడి మాట్లాడలేకపోతోందేం? మనసంతా కోపం నింపుకున్న జయంతికి కళ్ళనిండా నీళ్ళునిండి బుగ్గలమీదికి జారసాగినాయి.

శేఖరంలాటివాళ్ళు సాధారణంగా మాట్లాడరు. మాట్లాడితే అది అక్ష

రాలా నిజం అని రుజువు చేసుకుంటారు. సునంద యిష్టపడలేదు. ఎంత ప్రయత్నంచేసినా జయంతికి ఆ యింట్లోంచి బైటపడేమార్గం తోచలేదు. శేఖరం, సునందభర్తకి అంతక్రితం జయంతి చేసే ఉద్యోగం యిచ్చాడు.

సునందా వాళ్ళరాకపోకలు ఎక్కువైనాయి. వనితావిహార్ వాళ్ళు చూపిస్తున్న ఆదరణగూడా అంతంలేకుండా వుంది. చీటికి-మాటికి యేదో వంకమీద జయంతిదగ్గరికి వాళ్ళు వచ్చి కూర్చుంటున్నారు. గంటలతరబడి జయంతి వినకపోయినా వాళ్ళ సోదేదో వాళ్ళు చెప్పుకుని వెడుతున్నారు. వాళ్ళ యిళ్ళలో జరిగే ప్రతి ఫంక్షనుకి జయంతిని పిలుస్తున్నారు. జయంతి నూటికి 99 సార్లు వెళ్ళకుండా తిరస్కరిస్తోంది. అదే చిత్రం! ఐనా వాళ్ళు పట్టించుకోవటంలేదు. "వాళ్ళకి కావాల్సింది మీరుకాదు. మీ ద్వారా శేఖరంగారు." ఓ సారి యీ గొడవంతా జయంతినోటినుంచి విని శివరామ్ నవ్వుతూ అన్నాడు. నిజమే. నవ్వింది జయంతి. మరింత అసహ్యంవేసింది.

● ● ●

ఉదయం 10 గంటలకి కామేశ్వరమ్మగారి దగ్గరకు వెళ్ళిన జయంతి సాయంత్రం నాలుగయేసరికి యింటికి వచ్చింది. వరండా మెట్లెక్కుతుండగా లోపల్నుంచి మాటలు విన్పించాయి.

"ఏం గవర్నమెంట్? ఏం ఆనకట్టలండీ! ఈరోజు చూసిన ప్రాజెక్టు తెల్లవారిచూస్తే ఒక్క సిమెంటు ముక్కగూడా మిగల్లేదుట! ఇంజనీర్లంతా యిక్కడే ఎక్కడో కట్టామే అని తలలు గోక్కోవాల్సి వచ్చిందట! దేశం బాగుపడటమంటే యెలాబాగుపడ్తుంది! దరిద్రం తీరమంటే యెలా తీర్తుంది." ఎవరో ఆవేశంగా బిగ్గరగా అంటున్నాడు. శేఖరం యెవరితోనో మాట్లాడ్తున్నట్టున్నాడు.

జయంతి పమిటతీసి భుజంచుట్టూ కప్పుకుని తల వంచుకుంటూ గబగబా లోపలికి వెళ్ళి పోబోయింది.

"జయంతీ! యిలారా!" హాలు దాటి లోపల అడుగు పెట్టేస్తుండగా శేఖరం వెనకనుంచి పిలిచాడు.

ఆగి వెనక్కి తిరిగింది. ఐదారుగురు ఆడవాళ్ళు-యిద్దరు మగవాళ్ళు వున్నారు.

"రా!" అని యింకోసారి పిలిచి 'యీమె—' అంటూ పరిచయం చేయబోయాడు.

"తెలుసులెండి. మిసెస్ శేఖరం" ఒకావిడ తెలినంతా ఒలకబోసింది. ఉలిక్కిపడ్డ జయంతి ఆవిడవైపు కోపంగా చూసింది. శేఖరం ఆవిడ పొరపాటును కరెక్ట్ చెయ్యకుండానే "వీళ్ళంతా వరదబాధితుల సహాయార్థం విరాళాలు పోగుచేస్తున్నారుట— ఇదిగో యీమె సరస్వతీ రామన్—" నల్లగా పొట్టిగా అడ్డంగావున్నావిడని చూపించాడు. జయంతి నమస్కారం చేసింది. ఆవిడలేచి ప్రతి నమస్కారం చేస్తూ 'కూర్చోండి' అంది. హాల్లో మిగతా సోఫాలు, చైర్స్ అందరూ ఆక్రమించేసుకున్నారు. శేఖరం పక్క తప్ప యెక్కడా ఖాళీలేదు. శేఖరం జరిగి చోటిచ్చాడు. కాని జయంతి కూర్చోలేదు. అతని సోఫా ప్రక్కగా నిలబడిపోయింది.

సరస్వతీరామన్ తనవెంట వచ్చిన వాళ్ళందర్నీ పరిచయం చేసింది.

"ఇంతకీ యెంత యివ్వాలో చెప్పండి" శేఖరంనవ్వుతూ అన్నాడు.

"ఎంతేమిటండీ! మేం అడిగినంత మీరిస్తారా? ఏదో వుడతాభక్తి. మరీ మీ స్థితికి తగకుండావుంటే చాలు" సరస్వతీ రామన్ డబ్బెక్కువ యెలా రాబట్టాలో తెలుసు.

"బాగుంది. నేనిచ్చే డబ్బుతో నాస్థితి తెలుస్తుందంటారా?"

"అదీ కాదనుకోండి. సహజంగా మీ కేవో అలవాట్లుంటాయిగా!" శేఖరం జేబులోంచి పర్సు తీస్తుండగా—యింకో ఆమె "పోనీ మీ మిసెస్‌కి యివ్వండి—ఆవిడ యెంత యిస్తే అంతే" అంది. జయంతి వారించబోతున్నట్టు యేదో అనబోతుండగా శేఖరం తనే అందుకుంటూ "ఆమె పేరు జయంతి. పేరువదిలేసి మీరు మిసెస్ మిసెస్ అంటే ఒప్పుకోదు." అన్నాడు రెండర్థాలు వచ్చేట్టు.

"ఓహో! చాలా స్వతంత్ర భావాలుగల వ్యక్తి కాబోలు."

"పోనీండి! జయంతీ శేఖర్ అంటాం."

"వద్దు వద్దు. కోపంవచ్చేపనిచేస్తే మన విరాళం తగ్గిపోవచ్చు."

"జయంతిగారు! మీకుతోచింది యివ్వండి" అంది సరస్వతీరామన్ ఇదంతా హాస్యంగా తీసుకుంటూ.

శేఖరం పర్సు జయంతి కందిచ్చాడు. అది అందుకోకుండా అతనివైపు చూస్తుండిపోయింది. 'ఊ! యివ్వు—' అన్నాడు నవ్వుతూ.

"ఇంకా పిల్లాపాపా లేనట్టుంది!" యెవరో మెల్లగా అనటం జయంతికీ, శేఖరాని కిద్దరికీ విన్పించింది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. శేఖరం కళ్ళలో చిత్రమైన భావం —, మనోహరంగా మెరిసి జయంతి గుండెల్లోకి దూసుకు పోయి క్షణంసేపు కొట్టుకునేలా చేసింది.

గభాల్న అతని చేతిలో పర్సు లాక్కుని తెరిచి అందులోవున్నదంతా యెంతవుందో చూడకుండా తీసి సరస్వతీ రామన్ చేతిలో పెట్టేసింది.

"గుడ్! చాలా ఉదార హృదయులు మీరు. 800 విరాళం అంటే సామాన్యంగాదు." లెక్క పెట్టుకొని బాగ్‌లో పెట్టుకుంటూ అంది.

"ఎనిమిది వందలా!" జయంతి మనసులోనే వులిక్కిపడింది. భయంగా శేఖరంవైపు చూసింది. శేఖరం యిదేం గమనించనట్టు "మరి ముందే మీరు మీస్థితికి తగ్గట్టు అని లంకె పెట్టారయ్యె" అన్నాడు నవ్వి.

వాళ్ళు వెళ్ళిపోయిం తర్వాత జయంతి 'క్షమించండి' అంది.

"ఎందుకు ?"

"నేను డబ్బు అంత వుంటుందనుకోలేదు."

"అదా ?" అంటూ నవ్వేసి "నీ కోపం తెప్పించినందుకు నాకి మాత్రం శిక్షలేకపోతే యెలా?"

జయంతి మర్చిపోయిన కోపం రెట్టింపుగా తిరిగివచ్చింది.

"లేకపోతే! బుద్ధిలేదూ వాళ్ళకి. ఆడామగాకన్పిస్తేఅనెయ్యటమేనా?"

"వాళ్ళదేం పొరపాటు లేదు జయంతీ! నేనుఒంటరిగాడినని తెలుసు. నాభార్య కాకపోతే యింకే ఆడది అంత చనువుగా యింట్లోకి వెడ్తుంది? అందులో నువ్వేమో బుద్ధిమంతురాలిలా పమిట భుజాల చుట్టు కప్పుకుని మెడను కనపడనివ్వలేదు."

"అవును నిజమే!" జయంతి కప్పుడు గుర్తొచ్చింది.

"ఛీ-ఛీ-" పమిటతీసి, సరిగ్గావేసుకుంటూఅక్కడినుంచి వెళ్ళిపోయింది.

● ● ●

శేఖరం ఆరోజు మామూలువేళ కంటే చాలా ముందుగా యింటికి వచ్చేశాడు. జయంతి గదిలో కూర్చుని తల దువ్వుకుంటోంది. అతని చేతిలో ఏదో ప్యాకెట్ వుంది. అది జయంతి పక్కనపెడుతూ "త్వరగా తయారుకావాలి" అన్నాడు.

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఈరోజు ప్రమీల పుట్టినరోజన్న సంగతి మర్చిపోయావా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

మొన్నటిరోజున ప్రమీల యిద్దరు స్నేహితురాళ్ళని వెంటేసుకుని వచ్చి యెల్లుండి తన పుట్టినరోజని, తప్పకుండా రావాలని మరీ మరీ పిలిచింది. ప్రమీల వచ్చినప్పుడు శేఖరం గూడా యింట్లోనే వున్నాడు. చదువుకుంటున్న పేపరు ప్రక్కకుతీస్తూ "ఇంకా పుట్టినరోజేమిటి ? పాపాయివా ?" అని వెక్కిరించాడు.

"ఔను. పాపాయినే!" అంది సగర్వంగా ప్రమీల.

"పాపాయేమిటి ? నువ్వింకా అసలు పుట్టనేలేదు. ఎల్లుండి పుట్టబోతున్నావు!" ఎగతాళి చేశాడు.

"ఔనౌను. జోలపాట పాడటానికి మీరు రండి" ఫక్కుమని నవ్వింది ప్రమీల.

"అసలుసంగతి నాకు తెలుసులే! ఈరూపేణా అందరిదగ్గిర బహుమతులు కొట్టెయ్యొచ్చని."

"అయ్యో! తమరేం తీసుకురానవసరంలేదు, ఒకవేళ తెచ్చినా తిప్పి పంపబడును. సరా ? తమరు దయచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపితే అదే మాకు మహాభాగ్యం!"

శేఖరం లేచివచ్చి ప్రమీల నెత్తిన మొట్టి "ఎన్నింటికి రావాలి ?" అన్నాడు.

"ఆడవాళ్ళు ఆరుగంటలనుంచి






ఎనిమిదిగంటలవరకు, మగవాళ్ళు ఎనిమిదిగంటలనుంచీ తొమ్మిదిగంటల వరకూ—"

"టైమింగ్స్ తప్పించివస్తే ఆడవాళ్లు మగవాళ్లుగా మారిపోతారా?"

"తప్పకుండా!"

జయంతి యిద్దరిసంభాషణవింటూ కూర్చుండిపోయింది. ప్రమీల మరో

సారి తప్పకుండా రమ్మనమని జయంతికి చెప్పి వెళ్ళిపోయింది. ఈరోజు పుట్టినరోజు అని గుర్తున్న మాట నిజమే! కాని ప్రమీలా వాళ్ళింటికి వెళ్ళటానికి జయంతికి యేమాత్రం యిష్టంలేదు. అందుకే తీరికగా కూర్చుని జుట్టు చిక్కు తీసుకుంటోంది.

'నిన్నే మాట్లాడవేం? నువ్వు త్వరగా తయారైతే నేను క్లబ్‌కి వెడ్తూ వెడ్తూ నిన్నక్కడ దించేసి వెళ్ళి, వచ్చేటప్పుడు యెక్కించుకొస్తాను,' అని టవల్ తీసుకుని బాత్‌రూమ్ వైపు వెళ్ళబోతూ 'ఆ పెట్టెలో యేముందో చూడు' అన్నాడు కుతూహలాన్ని రేకెత్తించే కంఠంతో.

'యేమిటది?' నిర్లక్ష్యంగా అడిగింది.

'తెరిచిచూడు నీకే తెలుస్తుంది,' అంటూ బాత్‌రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

అతను ముఖం అదీ కడుక్కుని తిరిగి వచ్చినా జయంతి యింకా అలాగే తలదువ్వుకుంటూ కూర్చుంది.

'అదేమిటి యింకా అలాగే కూర్చున్నావేం?'

జయంతి తలెత్తుతూ 'వెళ్ళితీరాలా' అంది.

"అవును వెళ్ళితీరాలి" శేఖరం పెట్టెవైపు చూశాడు. అది పెట్టిన చోట పెట్టినట్టేవుంది. ముట్టుకున్న జాడలే లేవు. కనుబొమలు కొద్దిగా ముడుస్తూ 'అందులో నీకు చీరవుంది. అది నీ నీలం చికిల్ వాయిల్ జాకెట్‌కి మాచ్ అవుతుంది. ఈ చీర కట్టుకుని ఆ బ్లౌజ్ వేసుకురా!" అన్నాడు.

'నేను వేసుకునే బట్టలుగూడా మీరే యెన్నిక చేయాలా?'

'అవును. నువ్వు లేచి త్వరగా తయారయిరా! వెళ్ళు. అనవసరంగా నాతో ప్రతిదానికీ ఆర్గ్యూ చెయ్యకు. నాకు నచ్చదు."

జయంతి త్వరత్వరగా జడ అల్లుకోవడం ముగించి నిశ్శబ్దంగా అట్టపెట్టె తీసుకుని వెళ్ళిపోయింది.

లేత నీలంరంగుకి చిక్కటి నీలంలో హంసలబారున్న చీర.

జయంతి పది నిమిషాల్లో తయారై వచ్చింది. శేఖరం మొహం వికసించింది. 'ఏదీ యిటు తిరుగు. ఇలా దగ్గరగారా!' చీర అంచు మడతపడినచోట సరిచేస్తూ 'అచ్చు నేను వూహించినట్టే వున్నావు. చాలాబాగుందీచీర. నీకునచ్చిందా?'


'ఊపిరాడనట్టు ఖైమైపోతోంది అన్నారుగా' నిర్లిప్తంగా అంది. శేఖరానికివెంటనే దగ్గరకు లాక్కుని బుంగమూతి పెట్టుకున్న ఆ పెదవుల్ని కసితీరా "వద్దు—వద్దు—నవ్వుతూవుంటాను"అని బ్రతిమలాడేవరకూ కొరకాలనిపించింది.

'ఎంత బాగున్నావో తెలుసా! నామీద కోపంతో నీ కళ్ళకి పొరలు అడ్డొచ్చాయిగాని—"

ఎవరు చెప్పారు?'

"నీ మొహం తెలియటంలా!" అంటూ మృదువుగా భుజాలమీద చేతులాన్చి 'జయంతీ! ఆ రోజు—






సినిమాహాల్లో పుట్టిన రోజుకి నేను పంపిన చీర కట్టుకున్నప్పుడు ఇలాగే వున్నావా?' అన్నాడు.

జయంతి మాట్లాడకుండా మొహం తిప్పేసుకుంది.

'జయా!—' శేఖరం యింకొంచెందగ్గిరకు తీసుకుని ఏదో చెప్పబోయాడు. వెంటనే అడ్డు తగుల్తూ 'దయవుంచి నన్నాపేరుతో పిలవకండి. నేను భరించలేను' అంది.

'ఎందుకని?'

"నన్నాపేరుతో బామ్మ తప్ప యింకెవరూ పిలవరు. నన్నంత ఆత్మీయంగా చూసేవాళ్ళు గూడా—'

కంఠం జీరపోవడంతో ఆగిపోయింది.

'ఆవిడ నాకా వారసత్వం వదిలి వెళ్ళిందంటే?—'

'అంతే సరిపోదు—'

'ఉదాహరణ చూపిస్తే—'

'మీరెప్పటికి చూపించలేరు.'

'ఇప్పుడే చూపిస్తా— చూపించనా!'

క్షణంసేపు అతని కళ్ళలోకిచూసిన జయంతి మెల్లగా అతనిచేతులనుంచి తప్పించుకుని దూరంగా వెళ్ళిపోతూ 'మీరుచూపించలేరు. ఒకవేళచూపించినా నేను నమ్మను. మీరు సమర్థులు. ఎన్నయినా సృష్టించగలరు.'

'జయంతీ!' దెబ్బతిన్నట్టు చూశాడు శేఖరం.

'మనం వెళ్ళటానికి యింకా అలస్యం అవుతుందంటే నాకు పనివుంది. సునంద కొడుక్కి స్వెట్టర్ అల్లుతున్నాను. అది పూర్తిచేసుకుంటాను.'

(సశేషం)